క్లుప్తంగా

ఆలయ అభివృద్ధికి కృషి చేస్తా



దుర్గాడలో ప్రత్యేక పూజలు చేస్తున్న సునీల్

పిఠాపురం: ఆలయ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని వైఎస్సార్ సీపీ కాకినాడ పార్లమెంటరీ ఇన్‌చార్జి చలమలశెట్టి సునీల్ అన్నారు. గొల్లప్రోలు మండలం దుర్గాడలో నూతనంగా నిర్మించిన బాలసుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయ ప్రారంభోత్సవం శనివారం వైభవంగా జరిగింది. కార్యక్రమంలో చలమలశెట్టి సునీల్ పాల్గొని స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. తొలుత అర్చకులు ఆయనకు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అధిక సంఖ్యలో స్వామివారిని దర్శించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

శృంగార వల్లభుని ఆదాయం రూ.4.78 లక్షలు



భక్తుల నుంచి పూజలందుకుంటున్న తిరుపతి శృంగారవల్లభ స్వామి

పెద్దాపురం: తిరుపతి శృంగార వల్లభస్వామి ఆలయానికి శనివారం భక్తులు బారులు తీరారు. ఆలయ చైర్మన్ కర్రి జగదీష్, ఈఓ వడ్డి శ్రీనివారావు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు ఏర్పాట్లు చేశారు. భక్తుల నుంచి అన్నదానం, విరాళాలు, దర్శనం, కేశఖండన టిక్కెట్ల ద్వారా శనివారం ఒక్కరోజు సుమారు రూ.4.78 లక్షల ఆదాయం సమకూరినట్లు ఈఓ తెలిపారు. సుమారు 15 వేల మంది భక్తులు స్వామిని దర్శించుకున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు.

రబీలో రైతులకు సూచనలివ్వండి



సమావేశంలో మాట్లాడుతున్న శాస్త్రవేత్త నరసింహారావు

పెద్దాపురం: ప్రస్తుత రబీ సీజన్‌లో రైతులకు మంచి సలహాలు, సూచనలిచ్చేందుకు శాస్త్రవేత్తలు, వ్యవసాయ శాఖాధికారులు కృషి చేయాలని సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ పి.మునిరత్నం అన్నారు. స్థానిక ఏరువాక కేంద్రంలో శనివారం ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా వ్యవసాయాధికారులకు శిక్షణ, సందర్శన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏరువాక కో–ఆర్డినేటర్ సీహెచ్‌వీ నరసింహారావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో మునిరత్నం మాట్లాడుతూ ప్రస్తుతం రబీ వరి పంట పిలకల దశ నుంచి ఆఖరి దశ వరకు వరిలో అక్కడక్కడ ఎండాకు తెగులు, సుడిదోమ ఆశించే అవకాశం ఉన్నందున రైతులను అప్రమత్తం చేయాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. ఏరువాక కేంద్రం కో–ఆర్డినేటర్ నరసింహారావు మాట్లాడుతూ ప్రస్తుత వ్యవసాయ స్థితిగతులపై వివరించారు. అనంతరం పలు అంశాలపై శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయాధికారులు విజయ్‌కుమార్, హరి, జ్యోతిర్మయి, శాస్త్రవేత్తలు నందకిశోర్, సీతారామ శర్మ, ప్రదీప్, సుధీర్, రామభద్రరాజు తదితరులు పాల్గొన్నారు.

మహా పుణ్యక్షేత్రంగా గొంచాల



సర్పంచ్ వెంకటరమణను సత్కరించిన పాదయాత్ర కమిటీ చైర్మన్ వాసుదేవ సుబ్బారావు

సామర్లకోట: మండల పరిధిలో గొంచాల గ్రామం మహా పుణ్యక్షేత్రంగా మారుతుందని శ్రీరామ పాద యాత్ర కమిటీ చైర్మన్ వాసుదేవ సుబ్బారావు అన్నారు. గొంచాల గ్రామం నుంచి భక్తులు పదేళ్లగా భద్రాచలానికి పాదయాత్రగా వెళుతున్నారు. మూడేళ్ల క్రితం దాతల సహకారంతో రథం తయారు చేయడంతో సీతారామ, లక్ష్మణ, ఆంజనేయస్వామి విగ్రహాలను రథంపై ఉంచి పాదయాత్ర నిర్వహించారు. ఆ విగ్రహాలనే గ్రామంలో ప్రతిష్ఠించి ఆలయాన్ని నిర్మించాలని సుబ్బారావు నిర్ణయించారు. ఈ విషయాన్ని సర్పంచ్‌కు వివరించగా ఆలయ నిర్మాణానికి నాలుగు సెంట్లు ఇచ్చేందుకు ఇచ్చారు. దాంతో శనివారం పాదయాత్ర కమిటీ ఆధ్వర్యంలో చైర్మన్ సుబ్బారావు సర్పంచ్ చోడిశెట్టి వెంకటేశ్వరరావుకు జ్ఞాపికను అందజేసి సత్కరించారు. ఆ స్థలంలో రామమందిరం నిర్మాణం, రథం షెడ్ నిర్మిస్తామని వివరించారు. గొంచాలను ఆధ్యాత్మిక క్షేత్రంగా తీర్చిదిద్దేందుకు భక్తులు సిద్ధంగా ఉన్నట్టు తెలిపారు. అలాగే శివాలయ నిర్మాణానికి స్థలం ఇచ్చేలా తీర్మానించిన ఇచ్చినట్టు సర్పంచ్ వెంకటరమణ వివరించారు.



ఉప్పాడ తీరంలో చక్రస్నానాలు ఆచరిస్తున్న భక్తులు



ఉప్పాడలో భోజనాలు చేస్తున్న భక్తులు



కుంతీమాధవస్వామిని తీరానికి తీసుకువస్తున్న దృశ్యం

సాగర తీరం.. జనసంద్రం

- భక్తిశ్రద్ధలతో మాఘపౌర్ణమి వేడుకలు
- బీచ్‌లో పుణ్యస్నానాలకు పోటెత్తిన భక్తులు
- ఘనంగా ఉప్పాడ తీర్థం

కొత్తపల్లి: మాఘపౌర్ణమిని పురస్కరించుకుని శనివారం పుణ్యస్నానాలు ఆచరించేందుకు జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలిరావడంతో ఉప్పాడ సాగరతీరం జనసంద్రమైంది. వేలాది మంది భక్తులు ఉప్పాడ తీరంలో పుణ్యస్నానాలు ఆచరించారు. సాంప్రదాయం ప్రకారం పిఠాపురంలో వేంచేసిన కుంతీమాధవస్వామి (దొంగ దేవుడు)ని తెల్లవారుజామున పండితులు ఊరేగింపుగా తీరానికి తీసుకువచ్చి చక్రస్నానం నిర్వహించారు. స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. శనివారం కావడంతో భక్తుల తాకిడి మరింత పెరిగింది. కొత్తపల్లి మండలం నుంచే కాకుండా పిఠాపురం, గొల్లప్రోలు, సామర్లకోట, బిక్కావోలు, పెద్దాపురం, కిర్లంపూడి, కాకినాడ రూరల్, తొండంగి మండలాల అధిక సంఖ్యలో భక్తులు వివిధ వాహనాల్లో తీరానికి తరలి వచ్చారు. ఎక్కువ మంది భక్తులు సుబ్బంపేట తీరంలో పుణ్యస్నానాలు ఆచరించారు. భక్తులు తమ పితృ దేవతలకు కదళీ ఫలాలను సమర్పించారు. పిఠాపురం సీఐ శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఎస్సై స్వామినాయుడు తన సిబ్బందితో బందోబస్తు నిర్వహించారు. సుమరు 50 వేల మంది భక్తులు తీరంలో పుణ్యస్నానాలు ఆచరించారు. పుణ్యస్నానాలు ఆచరించిన భక్తులు తీరంలోని ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకూ ఉప్పాడ తీర్థం వైభవంగా జరిగింది. తీరంలో కొత్తపల్లి పీహెచ్‌సీ డాక్టర్లు వైద్య శిబిరం నిర్వహించారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా గ్రామ కార్యదర్శి శ్రీనివాస్ ఏర్పాట్లను పర్యవేక్షించారు. పుణ్య స్నానాలకు వచ్చిన భక్తులకు దాతలు పులిహార, వాటర్ ప్యాకెట్లను పంపిణీ చేశారు.

అన్నసమారాధన

కొత్తపల్లి: మాఘపౌర్ణమిని పురస్కరించుకుని ఉప్పాడ తీరంలోని గంగాలమ్మ తల్లి ఆలయం వద్ద శనివారం భారీ అన్నసమారాధన నిర్వహించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో పలు రకాల వంటకాలతో భక్తులకు అన్నదానం చేశారు. సుమారు 5 వేల మంది భక్తులకు పాల్గొని అమ్మవారి అన్నప్రసాదం స్వీకరించారు.



ఉప్పాడ తీరంలో సముద్ర స్నానాలు ఆచరిస్తున్న భక్తులు

ఆలయాల్లో పూజలు, అభిషేకాలు



సామర్లకోటలో మాండవ్య నారాయణస్వామి గ్రామోత్సవం

సామర్లకోట: స్థానిక అతిపురాతన విష్ణు ఆలయమైన మాండవ్య నారాయణస్వామి గ్రామోత్సవం శనివారం భక్తిశ్రద్ధలతో సాగింది. స్వామి వారికి ఉదయం అభిషేకాలు, పూజలు చేశారు. సాయంత్రం ప్రత్యేక వాహనంపై ఆలయం నుంచి కాలిబాట వంతెన మీదుగా ఫ్లైఓవర్ బ్రిడ్జి, స్టేషన్ సెంటర్, గాంధీచౌక్, చిన్నవీధి, పెద్దవీధి, యర్లగడ్డవారి వీధి, నీలమ్మచెరువు, దేవీచౌక్ మీదుగా గ్రామోత్సవం ఆలయానికి చేరింది. స్వామి వారి గ్రామోత్సం ఇళ్ల వద్దకు రావడంతో భక్తులు స్వామి వారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు.

పంచారామంలో..

సామర్లకోట: స్థానిక పంచారామ క్షేత్రం బాలాత్రిపుర సుందరి సమేత కుమారా రామభీమేశ్వర స్వామి ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు చేశారు. మాఘ పౌర్ణమిని పురస్కరించుకొని తెల్లవారు జామున స్వామి వారికి అభిషేకాలు చేశారు. ఈఓ బళ్ల నీలకంఠం ఆధ్వర్యంలో ఆలయంలోని ఉప ఆలయాలలోను పూజలు చేశారు. సాయంత్రం స్వామి, అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరణలు చేశారు. భక్తులకు అన్న ప్రసాద వితరణ చేశారు.

మరిడమ్మ ఆలయంలో..

పెద్దాపురం: స్థానిక మరిడమ్మ ఆలయంలో పంచామృతాభిషేకాలు చేశారు. ఆలయ ఈఓ సీహెచ్‌వీ రామ్మోహనరావు, ఆలయ ట్రస్టీ చింతపల్లి బ్రహ్మాజీ ఆధ్వర్యంలో వేదపండితుల మంత్రాల మధ్య వెండి, బంగారు పుష్పాలతో పాటు పంచామృతాభిషేకాన్ని అత్యంత ఘనంగా నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.



మరిడమ్మకు పంచామృతాభిషేకం



పంచారామ క్షేత్రంలోని స్వామి వారు

రాష్ట్రస్థాయి పోటీల నిర్వహణ అభినందనీయం



జ్యోతి వెలిగించి పోటీలను ప్రారంభించిన దొరబాబు

- నియోజకవర్గ వైఎస్సార్ సీపీ కో ఆర్డినేటర్ దవులూరి దొరబాబు
- ఉత్సాహంగా రాష్ట్ర స్థాయి ఖోఖో పోటీల ప్రారంభం

సామర్లకోట: రాష్ట్ర స్థాయి ఖోఖో టోర్నమెంట్ సామర్లకోటలో నిర్వహించడం ఆనందంగా ఉందని నియోజకవర్గ వైఎస్సార్ సీపీ కో ఆర్డినేటర్ దవులూరి దొరబాబు అన్నారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో వైఎస్సార్ మెమోరియల్ పేరుతో ఏర్పాటు చేసిన ఈ టోర్నీని శనివారం రాత్రి ఫ్లెడ్ లైట్ల వెలుగులో ఆయన ప్రారంభించారు. క్రీడల్లో ప్రతిభ కనబర్చిన వారికి సచివాలయాల్లో 4 శాతం ఉద్యోగాలు రిజర్వేషను కల్పించనున్నట్టు తెలిపారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలను డీగ్రీ కళాశాలగా చేయడానికి సీఎం జగన్ రూ.18 కోట్లు ప్రకటించారని, త్వరలో అందుకు శంకుస్థాపన చేస్తానని దొరబాబు ప్రకటించారు. రాష్ట్ర ఖోఖో అసోసియేషన్ కార్యదర్శి ఎం.సీతా రామిరెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం క్రీడలకు ప్రాధాన్యమిస్తోందన్నారు. ఇందులో భాగంగానే రాష్ట్ర వ్యాప్తంగా సచివాలయాల్లో 500 మంది ఉద్యోగాలు పొందారన్నారు. రాష్ట్ర అసోసియేషన్ అధ్యక్షుడు టీఎస్ ఆర్‌కే ప్రసాద్ మాట్లాడుతూ తల్లిదండ్రులు తమ పిల్లలకు ఆటల పట్ల ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. ముందుగా వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేశారు. రాష్ట్ర ఖోఖో జెండాను, రాష్ట్ర జెండాలను ఆవిష్కరించారు.



శ్రీకాకుళం- చిత్తూరు మధ్య ఖోఖో పోటీ

ఆహ్లాదకరంగా ఖోఖో పోటీలు

ఖోఖో కోర్టులను మున్సిపల్ చైర్‌పర్సన్ గంగిరెడ్డి అరుణ, దవులూరి చారిటబుల్ ట్రస్టు అధినేతలు శనివారం ఉదయం ప్రారంభించారు. వివిధ జిల్లాల నుంచి స్త్రీ, పురుషుల జట్లు ఇక్కడకు చేరుకోగా ఉదయం బాలుర విభాగంలో చిత్తూరుపై శ్రీకాకుళం, అనంతపురంపై తూర్పుగోదావరి, గుంటూరుపై నెల్లూరు విజయం సాధించాయి. రాత్రి కడప–తూర్పుగోదావరి బాలికలు, నెల్లూరు–కడప బాలుర మధ్య పోటీలు ప్రారంభం అయ్యాయి. ఈ కార్యక్రమంలో ఉమ్మడి జిల్లా ఖోఖో సంఘ కార్యదర్శి కె.పట్టాభిరామమ్, టోర్నీ నిర్వాహక అధ్యక్షుడు ఉబా జాన్‌మోజెస్, వైస్ చైర్మన్–2 గోకిన సునేత్రాదేవి, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి ఆవాల లక్ష్మీనారాయణ, నిర్వాహక సహాయ కార్యదర్శి ఉబా కెనడీ తదితరులు పాల్గొన్నారు. 60 మంది న్యాయ నిర్ణేతలుగా హాజరయ్యారు. మూడు రోజుల పాటు జరిగే టోర్నీలో ఉత్తమ క్రీడాకారులతో రాష్ట్ర స్థాయి పురుషుల, స్త్రీల జట్లను ఎంపిక చేయనున్నట్టు రాష్ట్ర కార్యదర్శి సీతారామిరెడ్డి తెలిపారు. మార్చి 27 నుంచి ఏప్రిల్ 2వ తేదీ వరకు ఢిల్లీలో జరిగే జాతయ స్థాయి పోటీల్లో ఆ జట్లు పాల్గొంటాయన్నారు.

ఎన్నికల విధుల్లో నిర్లక్ష్యం వద్దు





హాజరైన ఆయా శాఖల అధికారులను ఉద్దేశించి మాట్లాడుతున్న ఆర్డీవో రామారావు

- స్వేచ్ఛాయుత ఎన్నికలకు కృషి చేయాలి
- ఈఆర్వో, ఆర్డీవో జేఎస్ రామారావు

పెద్దాపురం: సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో సిబ్బంది ఎన్నికల విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తప్పవని నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి, ఆర్డీవో జేఎస్ రామారావు హెచ్చరించారు. స్థానిక ఆర్డీవో కార్యాలయంలో శనివారం సార్వత్రిక ఎన్నికల్లో పాల్గొనే సెక్టోరియల్, పోలీస్ అధికారులకు రెండు రోజుల పాటు నిర్వహించే శిక్షణ తరగతుల ముగింపు సభలో ఆర్డీఓ మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికల షెడ్యూల్ విడుదల కానున్న నేపథ్యంలో సిబ్బంది తమ పనులను పక్కన పెట్టి ఎన్నికల విధుల్లో పూర్తిగా బాధ్యులు కావాలన్నారు. స్వేచ్ఛాయుత వాతావరణంలో ఎన్నికల నిర్వహణకు సిబ్బంది కృషి చేయాలన్నారు. ఎన్నికల కమిషన్ ఆదేశాలను తూచా తప్పకుండా పాటించాలని, ముందస్తు అనుమతి లేకుండా సిబ్బంది ఎక్కడికీ వెళ్లడానికి వీలులేదన్నారు. కేంద్ర ఎన్నికల సంఘం పరిధిలో ప్రభుత్వ ఉద్యోగులంతా పని చేయాలని, ఎటువంటి ఒత్తిళ్లకు లోను కాకుండా కేటాయించిన విధులను సక్రమంగా నిర్వహించాలని ఆదేశించారు. నియోజకవర్గంలో 200 పోలింగ్ కేంద్రాలున్నాయని, వీటికి 22 మంది సెక్టోరియల్, 22 మంది పోలీసులు వెరసి 44 మంది రిజర్వ్‌తో కలిపి శిక్షణ ఇవ్వనున్నట్టు తెలిపారు. వారంతా పోలింగ్ కేంద్రాల్లో పర్యటించి పోలింగ్ సామగ్రిని అందించేందుకు కేంద్రాల దూరాన్ని గుర్తించి సెక్టార్ అధికారులు సమాచారాన్ని నివేదిక అందించాలన్నారు. ఎన్నికల్లో అభ్యర్థుల ఖర్చు ఎప్పటికప్పుడు అకౌంట్ సిబ్బందికి తెలియజేయాలన్నారు. సెక్టార్ అధికారులు, ఫ్లయింగ్ స్క్వాడ్ టీముకు ఎటువంటి ఫిర్యాదులు వచ్చినా పది నిమిషాల్లో ఎన్నికల కమిషన్‌కు పంపించాలన్నారు. మోడల్ కోడ్ అమలును పగడ్బందీగా నిర్వహించాల్సిన బాధ్యత పోలీస్ ఎన్నికల సిబ్బందిపై ఉందన్నారు. అనంతరం పలు అంశాలపై ఆయన సమీక్షించారు. ఈ సమావేశంలో డీఎస్పీ లతాకుమారి, మాస్టర్ ట్రైనర్స్ జాన్ కెనడీ, సీతారామారావు, శ్రీనివాస్, డీఎల్‌పీఓ బాలామణి, సీఐ రవికుమార్, ఎస్‌ఐ వి.సురేష్, సీడీపీఓ ఉష, మున్సిపల్ డీఈ ఆదినారాయణ, సెక్టోరియల్, పోలీస్ సిబ్బంది ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

యువకుడి అదృశ్యంపై కేసు

కిర్లంపూడి: యువకుడు అదృశ్యంపై కేసు నమోదు చేసినట్టు స్థానిక ఇన్‌చార్జి ఎస్సై ఎస్.రామలింగేశ్వర రావు శనివారం తెలిపారు. వివరాల్లోకి వెళితే... మండలంలోని బూరుగుపూడి గ్రామానికి చెందిన జోకా ధర్మరాజు కుమారుడు జోకా అమరనాథ్‌స్వామి జగ్గంపేటలోని ఎయిర్‌టెల్ కంపెనీలో సిమ్ కార్డుల సేల్స్ ఏజెంట్‌గా పనిచేస్తున్నాడు. అమరనాథ్‌స్వామి ప్రతిరోజూ ఇంటికి ఆలస్యంగా రావడంతో తల్లి మందలించింది. దీంతో ఈ నెల 20న ఉదయం ఇంటి నుంచి బయటకు వెళ్లిన ఆ యువకుడు తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు, స్నేహితులు పరిసర ప్రాంతాలు, బంధువుల ఇంటి వద్ద గాలించినా ఆచూకీ తెలియకపోవడంతో యువకుడి తండ్రి ధర్మరాజు శనివారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై రామలింగేశ్వరరావు తెలిపారు.

స్కేటింగ్‌కు ఉజ్వల భవిత



స్కేటింగ్ రింక్ ప్రారంభ కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంపీ వంగా గీత

- ఎంపీ వంగా గీత
- రాష్ట్ర స్థాయి స్కేటింగ్ పోటీలు ప్రారంభం

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): అంతర్జాతీయ ప్రమాణాలతో నిర్మించిన తొలి ఇండోర్ స్కేటింగ్ రింక్ దేశంలోనే తొలిసారిగా కాకినాడలో ఏర్పాటైందని ఎంపీ వంగా గీత అన్నారు. శనివారం కాకినాడ రాజా ట్యాంక్ ఆవరణలోని వైఎస్సార్ ఇంటర్‌నేషనల్ ఇండోర్ స్కేటింగ్ రింక్‌లో ఏర్పాటు చేసిన రాష్ట్రస్థాయి పోటీలను ఆమె ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఎంపీ మాట్లాడుతూ ఈ రింక్‌ను క్రీడారంగంలో ఒక కిలికితు రాయిగా అభివర్ణించారు. ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి మాట్లాడుతూ క్రీడారంగంలో ఎన్నో విజయాలు సాధిస్తున్న కాకినాడలో ఏర్పాటైన ఈ రింక్ ఈ ప్రాంత స్కేటింగ్ క్రీడాకారులకు ఎంతో ప్రయోజనకరం అన్నారు. 200 మీటర్ల ట్రాక్‌తో పాటు వీక్షకుల కోసం గ్యాలరీ, టాయిలెట్స్, కార్యాలయం సహా అన్ని సదుపాయాలు కల్పించామన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ క్రీడారంగానికి ఎంతో ప్రాధాన్యమిస్తున్నారని, ఇటీవల నిర్వహించిన ఆడుదాం–ఆంధ్రా కార్యక్రమమే ఇందుకు నిదర్శనం అన్నారు. అనంతరం రాష్ట్రస్థాయి పోటీలను అతిథులు ప్రారంభించారు. రింక్ నిర్మాణానికి కృషి చేసిన స్మార్ట్ సిటీ ఎస్‌ఈ పి.వెంకట్రావు, కాంట్రాక్టర్లు ఆదిత్య, ధర్మతేజ్‌లను ఎంపీ, ఎమ్మెల్యేలు సత్కరించారు. ఎమ్మెల్సీ కర్రిపద్మశ్రీ, కౌడా చైర్‌పర్సన్ రాగిరెడ్డి చంద్రకళాదీప్తి, వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షురాలు సుంకర శివప్రసన్న, కమిషనర్ జె.వెంకటరావు, ఏడీసీ నాగనరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

మహిళాభివృద్ధికి చేయూత

- నాడు చెప్పారు.. నేడు చేసి చూపారు..
- బీసీ, ఎస్సీ, మైనార్టీలకు తీరిన కష్టాలు
- ఏటా రూ.75 వేల ఆర్థిక సాయం

పెద్దాపురం: సమాజాభివృద్ధిలో సగభాగం స్త్రీ. ఆమె ఎక్కడ ఆనందంగా ఉంటుందో ఆ కుటుంబం ఆరోగ్యంగా ఉంటుందనడంలో ఏ మాత్రం అతిశయోక్తి కాదు. ఆధునిక యుగంలో స్త్రీ ఎంత ముందంజలో ఉన్నా ఆర్థికంగా స్థిరపడితే సమాజంలో ఆ కుటుంబానికి ఉన్న గౌరవం అంతా ఇంతా కాదు. ఆ గౌరవాన్ని ఇచ్చేందుకే నేనున్నానంటూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి నవరత్నాల పథకాల్లో భాగంగా మహిళల ఆర్థికాభివృద్ధికి ప్రవేశపెట్టిన 'వైఎస్సార్ చేయూత' ఎందరో మహిళలకు వరమైంది.

ఈ పథకం ద్వారా 45 ఏళ్లు నిండిన బీసీ, ఎస్సీ, మైనార్టీ వర్గాల మహిళలకు నాలుగు విడతలుగా రూ.75 వేల చొప్పున ఆర్థిక సాయం అందించారు. ఈ మొత్తంతో ఎందరో మహిళలు చేతనైన విధంగా ఉపాధి మార్గాలు ఏర్పరచుకున్నారు. ఇంతటి ఆసరా కల్పించిన సీఎం జగన్‌కు తామంతా రుణపడి ఉంటామని, ఆయనకు అండగా ఉంటామని వారు చెప్తున్నారు.



జగన్‌మోహన్‌రెడ్డి పాదయాత్రలో ఆయనతో నడుస్తున్న మహిళలు (ఫైల్)

ఆర్థిక ఇబ్బందులు అధిగమించాం



గ్రామీణ మహిళల కష్టాలను గుర్తించిన జగన్‌మోహన్‌రెడ్డి చేయూత ద్వారా సాయం అందించడంతో ఆర్థిక ఇబ్బందులను అధిగమించాం. స్వశక్తితో చిరు వ్యాపారాలు సాగించుకుని నిలదొక్కుకున్న మహిళలు ఎంతో మంది ఉన్నారు.

– బూరాడ వీర్రాఘవమ్మ, మాజీ సర్పంచ్, సిరివాడ, పెద్దాపురం మండలం.

వితంతువులకు అండగా ఉంటుంది



భర్త లేని వితంతు మహిళలకు ఎందరికో చేయూత పథకం అండగా ఉంటుంది. వారికే కాకుండా ప్రమాదాల్లో భర్త చనిపోయి చాలీచాలని పింఛన్ అందుకుంటున్న వారికి మంచి చేకూరేలా పథకం ఉండడం అభినందనీయం.

– నానేపల్లి అమ్మాజీ, చంద్రమాంపల్లి, పెద్దాపురం మండలం.

ముస్లిం మహిళలకు మంచి లబ్ధి



నిత్యావసర ధరలు పెరుగుపోతున్న తరుణంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన చేయూత ముస్లిం మహిళలకు ఎంతో లబ్ధి చేకూర్చింది. ఆర్థిక సాయం అందితే అందరి కష్టాలు తీరుతాయి.

– సయ్యద్ అమీనా బీబీ, 16వ వార్డు కౌన్సిలర్, కబడ్డీ వీధి, పెద్దాపురం

వర్క్‌షాప్‌కు వెళితే వేధిస్తున్నాడు

- మెకానిక్‌పై నర్సుల ఫిర్యాదు

కాకినాడ క్రైం: విధి నిర్వహణలో భాగంగా తమ వార్డులో ఉన్న పరికరాల మరమ్మతు కోసం వర్క్‌షాప్‌కి వెళితే అక్కడ గ్రేడ్–2 మెకానిక్ సురేంద్రరాజు తమని వేధిస్తున్నాడని సూపరింటెండెంట్ డాక్టర్ ఎంపీఆర్ విఠల్‌కు జీజీహెచ్ నర్సులు మొరపెట్టుకున్నారు. ఈ మేరకు 50 మంది నర్సులు తమ సంతకాలతో శనివారం లిఖితపూర్వక ఫిర్యాదు చేశారు. నర్సులను ఏకవచనంతో సంబోధించడం, చులకన భావంతో చూడటం, కేకలు వేయడం సురేంద్రకు పరిపాటిగా మారిందని ఆరోపించారు. పెద్దగా అరుస్తూ దురుసుగా ప్రవర్తిస్తున్నాడనీ, నర్సులను భయభ్రాంతులకు గురి చేస్తున్నాడని విన్నవించారు. ఈ పరిస్థితిపై నర్సులు తమ అధికారులకు ఫిర్యాదు చేస్తే ఎవరిని ఎక్కడ నొక్కాలో తనకు తెలుసు అంటూ అసభ్య పదజాలంతో అవమానించాడని ఫిర్యాదులో పేర్కొన్నారు. వార్డులో పని అవ్వాలంటే తన రాక కోసం వర్క్‌షాప్ బయట డోర్ వద్ద నిలబడి ఎదురు చూడాలంటూ అవమానంగా మాట్లాడుతున్నాడని పేర్కొన్నారు. అతడిపై విచారణ జరుగుతున్న నేపథ్యంలో విచారణ బృందం తమ ఆవేదనను పరిగణలోకి తీసుకొని సంబంధిత అంశాల స్పష్టత, వాస్తవికత నిర్ధారణల కోసం తమకూ అవకాశం కల్పించాలని కోరారు. సురేంద్రపై తక్షణ చర్యలు చేపట్టాలని ఈ సందర్భంగా వారు లిఖితపూర్వకంగా కోరారు.